విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ఏఎన్ఆర్‌లో వార్షిక ట్రైనింగ్ క్యాంపు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో జరుగుతున్న ఎన్.సి.సి వార్షిక ట్రెనింగ్ క్యాంపు ఈ నెల 26వ తేదీ వరకు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ తెలిపారు. బుధవారం క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.సి.సి. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్. సబ్యాసచిడాష్ ఆదేశాలు మేరకు 16 (ఆంధ్ర) బెటాలియన్ ఎన్.సి.సి. క్యాంపు కమాండెంట్ కల్నల్ సన్సార్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్.సి.సి. క్యాడేట్స్‌కు డ్రిల్, ఫైరింగ్‌లో శిక్షణిస్తున్నామన్నారు. ఎన్.సి.సి. క్యాంపుల ద్వారా క్యాడేట్స్ లో క్రమ శిక్షణ మరియు జాతీయ భావం పెంపొందుతుందన్నారు. ఈ క్యాంపులో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 7 కళాశాలు నుండి 207, 8 పాఠశాలలు నుండి 211 ఎన్.సి.సి. క్యాడేట్స్ పాల్గొంటు న్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు కె.ఎస్. అప్పారావు, యల్.ఆర్.కే. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, కళాశాల చీఫ్ లైబ్రేరియన్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎన్.సి.సి. అధికారి ఎం.డి. సలీం తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

విశాలాంధ్ర-గుడివాడ : అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను హత్య చేసేందుకు ప్రయత్నించాడు ఒక ప్రబుద్ధుడు. గుడివాడ మండలం మల్లాయిపాలెంతోని జగనన్న కాలనీలో నివాసముంటున్న మరీదు నాగరాజుకు భార్య దుర్గాదేవిపై అనుమానంతో తరచూ గొడవలకు దిగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం విడాకులు ఇవ్వాలంటూ భార్యతో ఘర్షణకు దిగిన నాగరాజు భార్యను కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. భార్య కేకలతో అప్రమత్తమైన ఇరుగు పొరుగు వారు నాగరాజుకు దేహశుద్ధి చేయడంతో అతను పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన దుర్గాదేవిను స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం హుటాహుటిన గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గుడివాడ రూరల్ పోలీసులు తెలిపారు. నిందితుడు నాగరాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 10 పతకాలు

విశాలాంధ్ర-గుడివాడ : పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన తిరువూరులో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో గుడివాడ లిఫ్టర్లు ప్రతిభ చాటారు. పతక గ్రహీతలను స్థానిక ఏలూరు రోడ్డులోని ఫిట్‌జోన్ జిమ్ ఆవరణలో బుధవారం పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సైదా, ఐఎంఏ నాయకులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ మలిరెడ్డి రవిలు అభినందించారు. బాలికల సబ్ జూనియర్స్ టీ.వెన్నెల 105 కిలోల బరువు నెత్తి గోల్డ్ మెడల్, 95 కిలోల బరువు నెత్తి రిత్విజ సిల్వర్ మెడల్, బాలుర విభాగంలో 140 కిలోల బరువు నెత్తి ఎస్.మోహన్ గోల్డ్ మెడల్ సాధించారు. జూనియర్ విభాగంలో 95 కిలోల బరువు నెత్తి వివేకానంద గోల్డ్ మెడల్, 90 కిలోల బరువు నెత్తి రిత్విక్ సిల్వర్ మెడల్ సాధించారు. సీనియర్ కేటగిరిలో మణికంఠ 430 కిలోల బరువు నెత్తి గోల్డ్ మెడల్, ఎల్ షేరిల్ సిల్వర్ మెడల్ గెలుపొందారు. మాస్టర్స్ విభాగంలో 215 కిలోల బరువు నెత్తి గంటా సురేష్ గోల్డ్ మెడల్, 93 కిలోల శరీర బరువు కేటగిరిలో పి.రవికుమార్ 320 కిలోల బరువు నెత్తి గోల్డ్ మెడల్, 96 కిలోల శరీర బరువు కేటగిరీలో వెంకటేశ్వరరావు 190 కిలోల బరువు నెత్తి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో జిమ్ సభ్యులు, లిఫ్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు గీతాలను కంఠస్తం చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యతో పాటు భగవత్ గీతా శ్లోకాలను కూడా కంఠస్తం చేయాలని భగవత్ గీతా ఉపన్యాసకులు ఎం శేషగిరిరావు అన్నారు. వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వం పౌర గ్రంథాలయ సంచాలకుల వారి ఉత్తర్వుల మేరకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో బుధవారం విద్యార్థులకు నీతి కథలు చెప్పడం, కథలు చదివించడం, చిత్రలేఖనం, పుస్తక పఠనం, తెలుగు పద్యాలు, పాటలు, డ్యాన్స్‌లు నేర్పించడం, భగవత్ గీతా శ్లోకాలు కంఠస్తం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులు విద్యార్థి దశ నుండి భగవత్ గీత లోని అన్ని శ్లోకాలను కంఠస్తం చేయాలని శేషగిరిరావు అన్నారు. గ్రంథాలయ అధికారి జె ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీచర్స్ ఎం సంధ్య, డి శ్రీజ, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిడ్ల మృతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అవనిగడ్డ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిడ్ల వీరరాఘవులు ఆకస్మికంగా మృతి చెందారు. నీతి నిజాయితీ గల నాయకుడు నిత్యం కాంగ్రెస్ పార్టీ కోసం పార్టీ బలోపేతం కోసం కష్టపడిన మహోన్నతమైన వ్యక్తి దిడ్ల వీరరాఘవులని కాంగ్రెస్ పార్టీకి దిడ్ల చేసిన సేవలను కొనియాడారు. ఈ నెల 13 న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందె శ్రీరామమూర్తి విజయం కోసం ఎనలేని కృషి చేశారని శ్రీరామమూర్తి అన్నారు. దిడ్ల వీరరాఘవులు (65) సోమవారం రాత్రి పక్షవాతానికి గురి కాగా, విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, పెద్ద ఎత్తున తరలివచ్చి దిడ్ల వీరరాఘవుల భౌతికాయాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కృష్ణా గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, జడ్‌పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎం.పి.పి తుంగల సుమతీ, వైయస్ఆర్‌సిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు నివాళ్ళు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పుస్తక పఠనంతో భాషపై మంచి పట్టు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక శాఖ గ్రంథాలయం లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులతో నీతి కథలు చదివించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులనుద్దేశించి శ్రీమతి తితలీ దేవి మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల భాష పై విద్యార్థులకు మంచి పట్టు లభిస్తుంది అన్నారు. అలాగే టీవీలు, సెల్ ఫోన్ లకు అలవాటు పడకుండా ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చేటట్లు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అల్యూమినియం వైర్లతో బొమ్మలు తయారు చేయడం తితలీ దేవి విద్యార్థులకు నేర్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, పద్యాల పోటీలు నిర్వహించారు. విజేతలకు శిక్షణా కార్యక్రమం ముగింపు రోజున బహుమతుల ప్రదానం చేస్తామని శాఖ గ్రంథాలయ అధికారిణి టి. వాణి తెలిపారు.

మూడో శుక్రవారం రోడ్డు భద్రత సమీక్ష

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : జిల్లాలో రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా రోడ్డు ప్రమాదాలు తగ్గించుటకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. రవాణా, పరిశ్రమలు, ఏపీఐఐసీ, పర్యాటక, కార్మిక, చేనేత, కాలుష్య నియంత్రణ శాఖలతో జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి, రవాణా శాఖ ద్వారా వాహనాలకు పర్మిట్ జారీ, రెవెన్యూ వసూళ్లు, వాహనాల లైఫ్ టాక్స్ వసూళ్లు, తదితర అంశాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆన్లైన్లో (ఈ -డీటెయిల్డ్ ఆక్సిడెంట్ రిపోర్ట్) నమోదు పరిశీలించి, జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం ప్రతి నెల 3వ శుక్రవారం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో పరిశ్రమల శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు గురించి ఆరాతీశారు, పారిశ్రామికీకరణ వృద్ధికి కృషి చేయాలని, ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహిస్తామన్నారు. జిల్లాలో పర్యాటక శాఖ ప్రాజెక్టులపై ఆరాతీసి, పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి పురేంద్ర, పరిశ్రమల శాఖ జిఎం వెంకట్రావు, పర్యాటక శాఖ అధికారి రామ్ లక్ష్మణ్, కార్మిక, చేనేత శాఖా అధికారులు పాల్గొన్నారు.

విజయడైరీ ఛైర్మన్ చలసానికి ఘన సన్మానం

విశాలాంధ్ర-గన్నవరం : విజయ డైరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పదవి బాధ్యతలు చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హనుమాన్ జంక్షన్ లోని కాకాని కళ్యాణ మండపంలో, గన్నవరంలోని బుద్ధవరం ఫీడ్ మిక్సర్ ప్లాంట్, కృష్ణ మిల్క్ యూనియన్ విజయవాడ లో డైరెక్టర్లు కస్టమర్లు సిబ్బంది నడుమ ఆయనను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట భాలవర్ధనరావు, విజయ డైరెక్టర్స్ పాలడుగు నాని పాల్గొన్నారు.

భయం..భయం!

- సవాళ్లతో అట్టుడుగుతున్న గ్రామాలు
- ఫలితాల తర్వాత పరిస్థితి ఏమిటో?
- గ్రామాల్లోని క్యాడర్ దారెటు?
- శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు రంగం సిద్ధం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ఎన్నికల సమయంలో నాయకులు చేసే ఓవరాక్షన్, సవాళ్లు, ప్రతి సవాళ్లతో గ్రామాలలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అనేక గ్రామాలలో వాతావరణం వేడివేడిగా ఉంది. ఇందుకు ప్రధాన కారణం నాయకుల అతి ఉత్సాహమే అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అగ్ర నాయకుల వద్ద మెప్పు పొందడానికో లేక తమ నియోజకవర్గంలో తమ పార్టీని గెలిపించడం కోసమో, పోలింగ్ సమయంలో ఎదుటి పార్టీకి సంబంధించిన ఏజెంట్లను భయపెట్టడానికి చేసే హంగామా మూలంగా అనేక గ్రామాలలో ఘర్షణ వాతావరణంతో ప్రస్తుతం గొడవలు ముదురు తున్నాయి. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడం కోసం చేసే ఈ విన్యాసాల వలన శాంతిభద్రతలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు పోలీసులు అష్ట కష్టాలు పడుతున్నారు. పోలింగ్ సమయంలోను, తర్వాత కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నాయకులను ఘర్షణ వాతావరణానికి ప్రేరేపించిన నాయకులు ప్రస్తుతం గ్రామాలు వదిలి పెద్ద పెద్ద నగరాలకు, పర్యాటక కేంద్రాలకు పయనమయ్యారు. వారి మాటలు నమ్మి గ్రామాలలో ఉండే వ్యక్తులను, పక్కింటి వారిని, ఇతర పార్టీల వారితో గొడవపడిన సామాన్య కార్యకర్తలు మాత్రం కేసులలో ఇరుక్కుని జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. పోలింగ్ ముందు, పోలింగ్ సమయంలో, పోలింగ్ తర్వాత కూడా పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయంటే, ఫలితాలు వచ్చాక పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. శాంతి భద్రతల సమస్యలను సృష్టించే వ్యక్తులపై పోలీసు అధికారులు కూడా కఠినంగా వ్యవహరించేందుకు రంగం సిద్ధం చేశారు.

రెచ్చగొట్టేవారు క్షేమం

ఫలితాలలో ఏ పార్టీ గెలిచినా నాయకులు మాత్రం క్షేమంగానే ఉంటారని వారి మాటలు విని గొడవలకు, అల్లర్లకు వెళ్లే కార్యకర్తలు మాత్రం కేసులలో ఇరుక్కుని జీవితాన్ని సర్వనాశనం చేసుకోవాల్సి వస్తుందని, ఇప్పటికే జీవితాన్ని కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు వ్యక్తులు విశాలాంధ్ర ప్రతినిధి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల తరువాత ఏ నాయకుడు మనల్ని ఆదుకోడని, ఎన్నికల సమయంలో వారి మాటలు విని గ్రామాలలో ఘర్షణకు దిగితే పోలీసుల చర్యతో జీవితాన్ని కోల్పోవాల్సి వస్తుందని పలువురు హితవు పలుకుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసిన ఫలితాల తర్వాత గ్రామాలలో ఘర్షణ వాతావరణం వస్తుందని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఎదుటి పార్టీ వ్యక్తులపై ఎటువంటి దాడులు చేస్తారోనని పల్లెల్లో చర్చించుకుంటున్నారు. గ్రామాలలో ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా గ్రామ పెద్దలతో పాటు, పార్టీల నాయకులు కూడా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు మేధావులు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసం కేంద్ర బలగాలు

ప్రస్తుతం గ్రామాలలో ఉన్న ఘర్షణ వాతావరణం తగ్గించేందుకు, ఫలితాల తర్వాత ఎటువంటి హింస జరగకుండా ఉండేందుకు కేంద్రబలగాలు రంగంలో దిగనున్నాయి. ఫలితాల తర్వాత పరస్పర దాడులు మొదలయ్యే అవకాశం ఉందని సమా చారం ఉండడంతో కేంద్ర బలగాలను సమస్యాత్మక ప్రాంతాలలో రంగంలోకి దించనున్నారు. అయితే ఈ సమయంలో హింసను ప్రేరేపిస్తే మాత్రం అటువంటి వారిపై భవిష్యత్తులో ఎన్నడూ లేని విధంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులతో పాటు ప్రభుత్వం హెచ్చరిస్తుంది. ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన ఎన్నికలలో ఎవరు విజేత అయినా ప్రశాంత జీవనాన్ని గడపాలని, అలా కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం ఎంతటి వారైనా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. మరి నాయకుల మాటలు విని జీవితాలను నాశనం చేసుకుంటారో.. లేక ప్రశాంత వాతావరణంలో జీవితాన్ని కొనసాగిస్తారో వేచి చూడాలి.

మార్కెట్లోకి ఖరీఫ్ విత్తనాలు

విశాలాంధ్ర-కూచిపూడి : తొలకరి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించుకోవటానికి సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే వరి నారుమడుగులకు విత్తనాలు కొనుగోలులో నిమగ్నమైనారు. ఏటా జూన్ నెలలో రెండవ వారంలో వరి నారిమడులు కోసుకునే రైతులు వర్షాలు ముందస్తుగా కురవటం, పొలాలు నారుమడులకు అనుకూలంగా ఉండటంతో వ్యవసాయ పనులపై దృష్టి సారించారు. కాగా ప్రైవేట్ మార్కెట్లోకి సబ్సిడీ లేకుండా విత్తనాలు రావడంతో కొనుగోలు చేసి విద్యుత్ బోరులక్రింద, ఆయిల్ యింజనుల కింద వరి సాగు చేసే రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.మొవ్వ మండలంలోని పెదపూడి లో వాసవి సీడ్స్ విక్రయాల ఏజెన్సీలో లైసెన్స్ దారుడు అయాచితుల జయ రవికుమార్ అమ్మకాలు ప్రారంభమైనాయి. 150 రోజుల వారి వంగడాలైన ఎంటీయూ 1061, ఎం టి యు 22 31, ఎం టి యు 2077, ఎం టి యు 13 18 రకాలు 30 కిలోల బస్తా 1250 రూపాయలకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఆర్.బి కేంద్రాలలో ఇప్పటికీ పచ్చిరొట్ట విత్తనాలే అందుబాటులోకి రాలేదు. వీటికి మరొక రెండు రోజుల్లో వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సబ్సిడీపైవరి వంగడాలు ఎప్పటికి వస్తాయో వారికే తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ దశలో ప్రైవేట్ మార్కెట్లో డీలర్ల వద్ద కొనుగోలుకు రైతులుఆసక్తి కనబడుటడంతో అప్పుడేడిమాండ్ పెరిగింది.

కోసూరులో తనిఖీలు

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఉత్తర్వులతోగుడివాడ డిఎస్పీ పి.శ్రీకాంత్ ఆదేశాలతో పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్సై టి.శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో పామర్రు సర్కిల్ పోలీస్ సిబ్బందితో కలిసి మొవ్వమండలంలో సమస్యాత్మక గ్రామా లలో ఒకటైన కోసూరు గ్రామంలో పొద్దుపోయే వరకు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోసూరు లో సమస్యాత్మక ప్రదేశాలు, అనుమానిత ప్రదేశాలలో అనుమానిత వ్యక్తులను ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదదళితవాడలో ప్రజలతో పామర్రు సీఐ వి సుభాకర్ ,కూచిపూడి ఎస్సై టి శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికలు అనంతరం గ్రామాలలో ఎటువంటి అల్లర్లు, హింసాయుత సంఘటనలు జరగకుండా శాంతి యుత వాతావరణం ఉండేలా ప్రతి పౌరుడు భాధ్యతగా వ్యవహరించాలి అని ప్రజలకు సూచించారు. కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు . ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్నికలు అనంతరం గ్రామాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండాతీసుకొను చర్యల్లో భాగంగా గ్రామాలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై మరియు అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలు, మారణాయుధాలు మరియు బాణాసంచా అక్రమ నిల్వలు ఉంచిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పామర్రు సీఐ వి. శుభాకర్ హెచ్చరించారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి గాని, ప్రేలుడు పదార్థాలు,మారణాయుధాలు అక్రమంగా నిల్వ ఉంచిన వారి గురించిన సమాచారం పోలీసులకు తెలియపరిచాలని సదరు సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

బందర్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : ఎన్నికల అనంతరం చెలరేగే హింసలపై ప్రత్యేక నిఘాఉందని హింసకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని బందర్ డిఎస్పి అబ్దుల్ సుభాన్ అన్నారు. బుధవారం జరిపిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు సజావుగా,ప్రశాంతమైన వాతావరణంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, జరిగేందుకు సహరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున నా ధన్యవాదాలు అని, ఎన్నికలకోడ్ సెక్షన్ 144 సీఆర్పీసి,పోలీస్ సెక్షన్ 30 అమలులోఉన్నందునఏ ప్రాంతంలో కూడా నలుగురుకన్న ఎక్కువమందిఒక్కచోటగుంపుగా ఉండరాదన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని, ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థిపార్టీనాయకులను, కార్యకర్తలను, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పెట్టి ప్రచారం చేయడం నేరమని, అలా రెచ్చగొట్టేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. సివిల్ తగాదాలను అడ్డు పెట్టుకొనిరెండు వర్గాల మధ్య కానీ,రెండు పార్టీల మధ్య కానీ, గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలింగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు.ప్రభుత్వ మద్యంషాపులవద్ద, బహిరంగ ప్రదేశాలలోమద్యంసేవించడంనేరం. అలా మద్యం సేవించి గొడవలు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని, యువత ద్విచక్ర వాహనాల సైలెన్సర్ తీసి ఎక్కువ శబ్దం చేస్తూ, ప్రత్యర్థి నేతల రెచ్చగొట్టే విధముగా నడిపిన, వారిపైకేసులునమోదుచేసి వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేస్తామన్నారు. అనుమతులు లేకుండాఎక్కువశబ్దాలువచ్చే డి జే సౌండ్స్ ఏర్పాటు చేయడం నేరమని,వేరే వర్గాల వారిని రెచ్చగొట్టే విధముగా సాహిత్యాలను, పాటను పెట్టుట శిక్షార్హం. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి డి.జె సౌండ్ సిస్టం సీజ్ చేస్తామన్నారు.ముందస్తు అనుమతులు లేకుండా గుంపులు గుంపులుగా చేరి ప్రజాజీవననికి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడతాయని,గ్రామాలలో ఎవరైనా అనుమానంగా తిరిగిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వెంటనే పోలీస్ వారికి సమాచారాన్ని ఇచ్చినయెడలసదరుసమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.పైన తెలిపిన సూచనలను నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్య తీసుకుంటామని, ప్రజలందరు శాంతియుత వాతావరణంలో జీవనం సాగించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలందరూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌వారికి సహకరించాలని, రాజకీయ పార్టీలవారు కూడా శాంతిభద్రతల విషయంలో పోలీస్ వారికి సహకరించాలన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులోని స్థానిక గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం నందు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పదవి బాధ్యతలు చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భముగా జిల్లా పాలకవర్గ సభ్యులు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, అర్జా వెంకట నగేష్ లు గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రంలో కేక్ కట్ చేసి చైర్మన్ చలసాని ఆంజనేయులు కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ చలసాని ఆంజనేయులు చైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ ఐదు సంవత్సరాల కాలంలో రూ.54 ఉన్న పాల సేకరణ ధరను పలు దఫాలుగా రూ.80 చేశారని, ఈ ఐదేళ్ల కాలంలో బోనస్ రూపేణ రూ.250 కోట్లు పాడి రైతులకు చెల్లించారని, వార్షిక టర్నోవర్ రూ.712 కోట్ల నుండి రూ.1196 కోట్లకు పెంచినట్లు తెలిపారు. కొత్తగా పాల ఉత్పత్తుల భవనం ప్రారంభించుట అదే విధంగా వీరవల్లిలో నూతన పాల ఫ్యాక్టరీలను సకాలంలో ప్రారంభించుట జరిగినది అని తెలిపారు. అనంతరం అర్జా వెంకట నగేష్ మాట్లాడుతూ పాడి రైతు సంక్షేమంలో భాగంగా క్షీరబంధు ద్వారా 8 కోట్ల ఖర్చుతో 1543 మరణించిన పాడి రైతు కుటుంబాలకు ఆసరాగా రూ 50,000/- ఇవ్వడం జరిగిందని, ఐదు కోట్ల ఖర్చుతో 2266 పాడి రైతు కుటుంబాల్లో వివాహం సందర్భంగా సమితి ఆశీర్వాదం క్రింద 20,000 రూపాయల విలువగల బంగారు నాణెం ఇవ్వడం, నాలుగు కోట్ల ఖర్చుతో పసు జాతి అభివృద్ధికి మేలు జాతి వీర్యం సరఫరా చేయటం, 11 కోట్ల ఖర్చుతో పాడి పశువుల అత్యవసర వైద్య సదుపాయం అందించడం వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలు నిర్వహించి చలసాని ఆంజనేయులు గారు కృష్ణా మిల్క్ యూనియన్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ తోట సత్యనారాయణ, ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు వివిధ పాల సంఘాల అధ్యక్షులు, సూపర్వైజర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-చల్లపల్లి : ఒంటరిగా నివసిస్తున్న వ్యక్తి మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన ఇది. చల్లపల్లి శివారు గంగుల వారిపాలెంకు చెందిన చిగురుపల్లి శ్యాంబాబు (33) బుధవారం తెల్లవారుజామున తాను నివసిస్తున్న గదిలో ఫ్యాను హుక్కు లుంగీతో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుడు ఎలక్ట్రీషియన్ గా పనులు చేస్తుంటాడు. శ్యాంబాబుకు 2010లో వివాహం జరుగ్గా, పాప జన్మించింది. ఏడెనిమిది సంవత్సరాలుగా భార్యాభర్తలు విడిపోయి ఎవరికివారుగా నివసిస్తున్నారు. పాపతో కలిసి భార్య హైదరాబాద్లో నివసిస్తుండగా, శ్యాంబాబు ఒక్కడే ఉంటున్నాడు. తల్లిదండ్రులు చనిపోగా, సోదరుడు సైతం గత కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. గంగులవారిపాలెంలోని రెండు గదుల పోర్షన్లో మృతుడు ఒక గదిలో నివసిస్తుండగా, మరో గదిలో వదిన పిల్లలతో ఉంటోంది. ఒంటరిగా నివసిస్తూ మనస్తాపంతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు. నెల రోజులుగా లైటింగ్ పనులకు సైతం వెళ్లటం లేదని తెలుస్తోంది. తన మరణానికి ఎవరినీ తప్పు పట్టవద్దనీ, జీవితంలో ఓడిపోయాననీ, పెళ్లి, పిల్లలు, చావు అన్నీ త్వరగానే అంటూ సూసైడ్ నోట్ రాసుకున్నాడు. శ్యాంబాబు మరణవార్త తెలుసుకున్న భార్య, కుమార్తె, వారి తరపు పుట్టింటివారు చల్లపల్లి వచ్చారు. మృతుని సోదరి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎ. పాండురంగారావు కేసు నమోదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీఆర్వో బేబి శవపంచనామా నిర్వహించగా, అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు.

ఈవీఎం పగలుకొట్టిన ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మాచర్ల నియోజకవర్గంలో ఈవిఎంలు పగలుకొట్టిన ఎం.ఎల్.ఎ పిన్నెలి పై కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని జనసేన పార్టీ కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13 వ తేదిన పల్నాడు జిల్లా వైయస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్ మాచర్ల నియోజకవర్గ ఎం.ఎల్.ఎ అయిన పిన్నెలి రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లోనికి ప్రవేశించి అక్కడ ఉన్న ఈవిఎం బాక్సులను నేలకేసి బద్దలు కొట్టి బయటకు వెళుతున్న సంఘటనలు సోషల్ మిడియా, పత్రికల్లో వచ్చిన వార్తలు చూస్తుంటే ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. నేడు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా....... అనాగరిక ప్రపంచంలో ఉన్నామా........ అర్థం కానీ పరిస్థితిలో ఉన్నామని, నాలుగు సార్లు శాసనసభ్యులుగా ఉండి ప్రభుత్వ విప్ భాద్యత వహిస్తున్న ఒక భాద్యత గల వ్యక్తి ప్రజాస్వామ్యంలో ఒక రౌడీల ప్రవర్తించడం సిగ్గుచేటు అని ఎన్నికలు అయ్యి 9 రోజుల అనంతరం ఈ సిసి ఫుటేజ్ బయటకు రావడం బాధ కలిగిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన ఒక ఎం.ఎల్.ఎ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న విధానం సిగ్గు చేటు అని ఎం.ఎల్.ఎ చేసిన చర్యకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి పేర్ని నాని, ప్రభుత్వ సలహాదారుడు అయిన సజ్జల రామకృష్ణా రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జుడిషియల్ ఎంక్వేరి జరిపించి ఎం.ఎల్.ఎపై అనర్హత వేటు వేసి అతని శాసన అభ్యత్వాన్ని రద్దు చేయాలని తక్షణమే చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

పెడనలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-పెడన : పట్టణంలో 19వ వార్డు దక్షిణ తెలుగు పాలెం, రామ లక్ష్మి వీవర్స్ కాలనీలో బందరు రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలోకార్డెన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఇళ్లలోకి వెళ్లి ప్రజల పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పెడన ఎస్ఐ టి సూర్య శ్రీనివాస్ తెలిపారు.కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమంలో గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను, ఎస్ఐలతో పాటు స్పెషల్ టీం, పెడన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఉదాసీనతపై ఆగ్రహం

పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఒక మహిళపై దాడి చేసిన ఘటనపై పోలీసులు ఉదాసీనవైఖరి చూపుతున్నారంటూ విస్సన్నపేట పోలీసుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం పోలీస్‌స్టేషన్ వద్ద దారి తీసింది. మండలంలోని తాతకుంట్ల పంచాయతీ శివారు గౌరంపాలెం గ్రామానికి చెందిన షేక్ ఆషా అనే మహిళకు, ఇదే గ్రామానికి చెందిన షేక్ హజరత్ అలీ(బుజ్జిమా) అనే యువకుని కుటుంబానికి భూ వివాదం తలెత్తింది. ఆషా టీడీపీ వర్గీయురాలు కాగా, హజరత్ అలీ వైసీపీ పార్టీకి చెందినవాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య సయోధ్య చేసేందుకు గ్రామంలోని కొందరు వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాల్లో భాగంగా తనను తమ పార్టీలో చేరాలని ఒత్తిడి చేసినట్లు బాధితురాలు ఆషా తెలిపారు. తాను ఒప్పుకోకపోవటంతో ఆగ్రహించిన యువకుడు తనపై దాడి చేసి, దుర్భాషలాడుతూ, కొట్టారని ఆరోపించారు. ఈ విషయమై, తనకు రక్షణ కల్పించి, నిందితునిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, మరోవైపు తాను గత ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేశానని కారణంతో తనపై వేధింపులు తీవ్రమయ్యాయని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి, రోజులు గడుస్తున్నా, చట్టపరమైన చర్యలు తీసుకోవటంలో జాప్యం నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధితురాలితో కలసి గౌరంపాలెం గ్రామస్తులు మంగళవారం రాత్రి విస్సన్నపేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమవ్వగా, ఎస్ఐ రామకృష్ణ వారితో చర్చలు జరిపారు. వెంటనే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామనే హామీ మేరకు గ్రామస్తులు ఆందోళన విరమించారు.

శాంతి భద్రతల విఘాతం కలిగిస్తే రౌడీషీట్ : సీపీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): శాంతి భద్రతల విఘాతం కలిగిస్తే రౌడీషీట్ తెరుస్తామని ఎన్టీఆర్ జిల్లా సీపీ రామకృష్ణ అన్నారు. ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న ఘర్షణలు, వివాదాల పై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వాటిని నిష్పక్షపాతంగా విచారించి ఘర్షణలకు పాల్పడిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. నేర చరిత్ర కలిగిన వారి పై, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ విద్వేషాలు రెచ్చగొడుతూ, ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడిన వారిని నేరాలు చేసిన వారిని గుర్తించి వారిలో ఇద్దరు వ్యక్తులపై పీడీ యాక్ట్, ఒక వ్యక్తిని నగర బహిష్కరణ, 20 మంది పై రౌడీషీట్లు, 55 మందిపై లా అండ్ అర్డర్ సస్పెక్ట్ షీట్స్ మొత్తం 78 మంది పై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రశాంతికి భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. జూన్ 4వతేదీన ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రౌడీలను, ఘర్షణలకు పాల్పడానికి అవకాశం ఉన్న వారిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు ఉందని చెప్పారు. గెలుపోందిన అభ్యర్థులు ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. బాణాసంచా కాల్చరాదన్నారు. ఎవరైనా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేసిన, కవ్వింపులకు పాల్పడిన, గొడవలకు దిగిన వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

తక్షణమే డ్రెయినేజీ సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బెంజ్‌సర్కిల్ నుండి ఆటోనగర్ మార్గంలో డ్రెయినేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్‌ఎఐ, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ బుధవారం ఆయన ఛాంబర్‌లో జాతీయ రహదారి డ్రెయినేజీ సమస్యపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65లో బెంజ్ సర్కిల్ నుండి ఆటోనగర్ మార్గంలో సరైన డ్రెయినేజీ లేకపోవడం వల్ల రెండు కిలోమీటర్ల వరకు సుమారు 4 నుండి 5 ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి వాహన దారులు, పాదచారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సజావుగా ఉండకపోవడంతో నగరంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు జాతీయ రహదారిపై నిల్వ ఉండి నగరం గుండా వెళ్లే వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయన్నారు. శాశ్వత పరిష్కార దిశగా నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు త్వరతగతిన పనులు చేపట్టి పరిష్కరించాలన్నారు. రానున్న వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని యుద్ధప్రాతిపదికన ఏ ఒక్కరికి నష్టం కలగకుండా నిబంధనల మేరకు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.పీ.సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎన్‌హెచ్‌ఎఐ పీడీ నారాయణరెడ్డి, విజయవాడ ఆర్‌డీవో సీహెచ్.భవాని శంకర్, నగరపాలక సంస్థ ఇఇ చంద్రశేఖర్, సిటీప్లానర్ జూబిన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల పరిషత్తు సమావేశం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. స్థానిక ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి అధ్యతక్షన ఆరంభమైన ఈ సమావేశంలో తొలుత సభ్యులు అల్పాహారం తీసుకున్నారు. సభ్యులంతా ఒకే పార్టీకి చెందినవారు కావటంతో ఎవరికి వారు తమ, తమ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ మెర్సీ వనజాక్షి మాత్రం వేదికపై అంతంతమాత్రంగా కొద్దిసేపు మాట్లాడారు. మరోవైపు అధికారులు సైతం ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా తాము విధులు నిర్వర్తించిన ప్రాంతాల్లో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు. అనంతరం సమావేశం ముగిసినట్లు ప్రకటించారు. మూడు మాసాలలోపు సమావేశం నిర్వహించాలనే నిబంధన మేరకు సమావేశం నిర్వహించామని, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మానాలు, చర్చలకు ఆస్కారం లేదని ఎంపీడీఓ ఎం.విజయకుమారి తెలిపారు.

వేటూరి వర్ధంతి

విశాలాంధ్ర-విజయవాడ(కల్చరల్) : సుప్రసిద్ధ తెలుగు సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి వర్ధంతి కార్యక్రమం విజయవాడలో బుధవారం జరిగింది. పోలవరం సాంస్కృతిక కళావేదిక గీతాంజలి మ్యూజికల్స్ ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహిత్య సాంస్కృతిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి క్షేత్రయ్య ప్రాంగణంలోని వేటూరి సుందర రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు మాటల పాటలతో తేనెలూరే తెలుగుదనాన్ని తెలుగుజాతికి అందించారని కొనియాడారు. ఆ బాల గోపాలం కొనియాడే విధంగా సినీ గేయాలను రచించి విమర్శకులచే ప్రశంసలు సైతం అందుకున్నారని పేర్కొన్నారు.

దూర విద్యతో వ్యవసాయ కోర్సు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి గుంటూరు లాం సార్వత్రిక మరియు దూర విద్యా కేంద్రం ఎంతోమంది రైతులు, మహిళలు, యువత మరియు ఆసక్తి కలిగిన వారు విద్య ను పొందేలా దూర విద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించడం జరిగింది. జులై నుండి ప్రారంభం కానున్న మూడు ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సులు (మిద్దె తోటల, పెంపకం పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువులు పెంపకం) ఎనిమిది వారాలు రెండు నెలలు నిర్వహించబడును. ఆసక్తి ఉన్నవారు రూ. 1500 చొప్పున చెల్లించి నమోదు కాగలరు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఆన్లైన్ సదుపాయం కలిగి ఉండాలి. ఈ సర్టిఫికెట్ కోర్సులు చేయుటకు ఆసక్తి కల వారు తమ పేర్లను జూన్ 20వ తేదీ లోపు నమోదు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు సంబంధించిన పూర్తి పూర్తి వివరాలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వెబ్ సైట్ సందర్శించాలని డాక్టర్ కే ఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్. ఎస్. కృష్ణంరాజు తెలిపారు.

చిన్నారులకు పౌష్టికాహారం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): హెచ్ఐవీ సోకిన చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. బుధవారం బీఆర్‌టీయస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ కార్యాయలం వద్ద హెచ్ఐవీ సోకిన అనాథ చిన్నారులకు పౌష్టికాహారం కిట్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ నాగ మల్లేశ్వరి, డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ చేతుల మీదుగా కిట్స్ పంపిణీ చేశారు. చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన చిన్నారులకు పౌష్టికాహారం అవసరమని చాలా మంది పేదవారు అది లభించక ప్రాణాపాయస్థితికి చేరుకుంటున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడం సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డిప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, ప్రధాన కార్యదర్శి కొండాగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, స్పందన సేవాసమితి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డిప్యూటీ గవర్నర్ ఇ.కృష్ణ ప్రసాద్, క్లబ్ ప్రధాన కార్యదర్శి షఫీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

లింబ్ సాల్వేజ్ సర్జరీ విజయవంతం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కుడి ముంజేయి పునరావృత సైనోవియల్ సార్కోమాతో బాధపడుతున్న 42 ఏళ్ల మహిళకు మంగళగిరిలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ) లింబ్ సాల్వేజ్ సర్జరీని విజయవంతంగా నిర్వహించింది. కీళ్ల చుట్టూ ఉన్న కణజాలాన్ని ప్రభావితం చేసే అరుదైన క్యాన్సర్ రూపం, సైనోవియల్ సార్కోమా. ఇది సాధారణంగా తుంటి, మోకీలు, చీలమండ లేదా భుజంలో కనిపిస్తుంది. ఏఓఐ వద్ద రోగి యొక్క ప్రయాణం రెండు కీమోథెరపీ చికిత్సలతో ప్రారంభమైంది. ఆ తర్వాత డాక్టర్ ఇషాంత్ అయినపూరి సంక్లిష్ట శస్త్రచికిత్సను నిర్వహించారు. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, శస్త్రచికిత్స బృందం ముంజేయిలో ముఖ్యమైన నరాలను కాపాడుతూ అన్ని ప్రభావిత భాగాలను విజయవంతంగా తొలగించింది. వాస్కులర్ పునర్నిర్మాణం, నరాల పునర్నిర్మాణం జరిగింది. ఏఓఐలోని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఇషాంత్ అయినపూరి ఈ కేసు గురించి వెల్లడిస్తూ, "ఈ కేసు యొక్క సంక్లిష్టత కారణంగా ఖచ్చితమైన ప్రణాళిక, అమలు చేసే విధానం అవసరం. రోగి యొక్క స్థిరత్వం, బృందం యొక్క నైపుణ్యం ఈ శస్త్రచికిత్స విజయంలో కీలక పాత్ర పోషించాయని అన్నారు. ఏఓఐ రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ, అధునాతన శస్త్రచికిత్సలను అందించడంలో ఏఓఐ యొక్క నిబద్ధతను ఈ కేసు వెల్లడిస్తుందని పేర్కొన్నారు.

ఉచిత ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి దేవాలయం వద్ద ఆయుష్మాన్ డిపార్టుమెంటు వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయానికి విచ్చేసిన మాజీ శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) క్యాంప్ ను సందర్శించి అక్కడ వున్న మందులను పరిశీలించారు.మెడికల్ క్యాంప్ నిర్వహించిన డాక్టర్ కృష్ణ మోహన్, యోగా టీచర్ అశ్విని మాట్లాడుతూ వేదాద్రి గ్రామంలో యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణం సందర్భంగా భక్తులు ఎక్కువగా వస్తారని ప్రజలకు ఎక్కువ సేవలు అందించటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ డిపార్టుమెంటు సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహ ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వీ.కామరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన శారీరక, బధిర, దృష్టిలోపం కలిగి 3వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి పాయకాపురం ఎల్‌బీఎస్ నగరలో ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహం నడుపుతున్నట్లు తెలిపారు. ఈ వసతులతో పాటు నర్సింగ్ సేవలను కూడా అందజేయటం జరుగుతుందని ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్, ఇతర వివరాలకు పాయకాపురంలోని విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వ బాలుర వసతి గృహ వార్డెన్ నాగస్వర్ణను సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9618972097కు ఫోన్ చేయాలని తెలిపారు.

క్యాంపు పరిశీలించిన గ్రంథాలయ కార్యదర్శి

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల,శాఖా గ్రంథాలయం నందు బుధవారం నాడు కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం వి వి నగేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. సమ్మర్ క్యాంప్ లో విద్యార్థులకు డ్రాయింగ్, యోగ, పాటలు, ఆటలు నేర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వర రావు, విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎమ్.కనకారావు,మాస్టర్ నవీన్ నానీ, యోగా మాస్టర్ ఎమ్.మల్లికార్జున రావు, గ్రేడ్ 2 గ్రంథాలయాధికారి అల్లూరు రామ చంద్రుడు పర్యవేక్షించారు.

లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ మండలం సత్యవరం పల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, బుధవారం ఆలయ అధ్యక్ష కార్యదర్శులు పబ్బతి నరసింహారావు, కొత్త వేణు మాధవుల పర్యవేక్షణలో అర్చక స్వాములు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి మూలవర్లకు తిరువంజనం, మూలమంత్ర హెూమాది క్రతువులు, విశేష అర్చనలు పూజలు జరిగాయి, రాత్రి ఆలయ ప్రాంగణంలో ని కళ్యాణ వేదికపై శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ నారసింహస్వామి దివ్య కళ్యాణం జరిగింది.

బిఏఎస్ఎఫ్ నుంచి ఏపీకాన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : స్థానిక విజయవాడ హెూటల్ ఫ్రైడ్ మాధవ్ నందు బిఏఎస్ ఎఫ్ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించబడిన సరికొత్త ఉత్పాదన "ఎఫికాన్" ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బిజినెస్ డైరెక్టర్-గిరిధర్ రానువా మాట్లాడుతూ మీ అందరి ఆదరాభిమానాలతో బిఏఎస్ ఎఫ్ వ్యాపారం ఎంతో అభివృద్ధి గడించిందని తెలుపుటకు మేమే ఎంతగానో గర్విస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జింగ్ క్వింగ్ బి-వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ ఆసియా ఫసిఫిక్, గిరిధర్ రానువా బిజినెస్ డైరెక్టర్ బిఏఎస్ ఎఫ్ , శశి కిరణ్ లింగం-రీజనల్ పోర్టుఫోలియో మేనేజర్ ఇన్సెక్టిసైడ్స్, ఆసియా ఫసిఫిక్, ప్రశాంత్ జోషి-హెడ్ మార్కెట్ మేనేజ్మెంట్ బిఏఎస్ ఎఫ్, నీలేష్ రావూల్-పోర్ట్ ఫోలియో మేనేజర్ బిఏఎస్ ఎఫ్, రమేష్ బాబు-బిజినెస్ యూనిట్ లీడ్ బిఏఎస్ ఎఫ్, భార్గవ్ రెడ్డి - మార్కెటింగ్ మేనేజర్ బిఏఎస్ ఎఫ్ శ్రీనివాస్ నూతి, రాకేష్ కుమార్-బిజినెస్ క్లస్టర్ లీడ్స్ బిఏఎస్ ఎఫ్, రమేష్-రీజనల్ మేనేజర్, మనోజ్ కుమార్ నూనె, వినయ్ ప్రభాత్ గ్యారంపెల్లి- టెరిటరీ మేనేజర్స్ బిఏఎస్ ఎఫ్, సాయి దుర్గ ఆగ్రో ఏజెన్సీస్ డిస్ట్రిబ్యూటర్ మాలంపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సర్వ్ ఫ్లాట్‌ఫారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన డిస్నీ ప్లస్ హాట్‌స్టార్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల టి20 ప్రపంచ కప్ 2024 కోసం తన సెల్ఫ్ సర్వ్ ప్లాట్‌ఫారమ్ వెర్షన్ 2.0ను ప్రారంభించామని డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ప్రకటించింది. ఆసియా కప్, ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్ 2023తో ఆగస్ట్ 2023లో తన మొదటి వెర్షన్‌ను విడుదల చేయగా, ఇది విజయాన్ని దక్కించుకుంది. ఈ అప్‌గ్రేడెడ్ వెర్షన్ ఐదు భాషలు ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ భాషలలో అన్ని వ్యాపారాలు, పరిమాణాలలో ప్రకటనకర్తలకు అంతరాయం లేకుండా, సేవలను అందుకునే అనుభవాన్ని అందిస్తుంది.

భారతదేశంలోని 240 కేంద్రాలలో కొత్త బ్యాచ్‌లను ప్రారంభించిన బైజూస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని అతిపెద్ద, శక్తివంతమైన లెర్నింగ్ సెంటర్‌ల నెట్‌వర్క్ బైజూస్, 2024-25 అకడమిక్ సెషన్ కోసం వారి 240 స్థానాల్లో పూర్తి స్వింగ్‌లో బ్యాచ్‌లను ప్రారంభించాయి. బీటీసీలు కె-12 విద్యార్థుల కోసం తరగతి గది ఆధారిత ప్రోగ్రామ్‌లను అందిస్తాయి. బైజూస్ యొక్క మొత్తం డిజిటల్ లెర్నింగ్ యూనివర్స్‌కు యాక్సెస్‌తో అనుబంధం ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి, బైజూస్ బీటీసీలకు వార్షిక రుసుమును కేవలం రూ. 36 వేలకు తగ్గించింది. ఇది ఇతర ట్యూషన్ తరగతుల కంటే మరింత తక్కువ. అదే సమయంలో పాఠ్యాంశాలు, బోధనాశాస్త్రం, డెలివరీ యొక్క చాలా ఉన్నతమైన నాణ్యతను అందిస్తోంది. బైజూస్ కూడా ఉపాధ్యాయుల పాత్రపై బలమైన ఆసక్తిని కనబరిచింది. గత రెండు నెలల్లో రోజుకు దాదాపు 1200 దరఖాస్తులను స్వీకరించింది.

క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్, ద్వార ఈ-డైరీతో గోద్రెజ్ క్యాపిటల్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ యొక్క ఆర్థిక సేవల విభాగం అయిన గోద్రెజ్ క్యాపిటల్, డైరీ ఫామ్ రుణాలను ప్రారంభించడంతో వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్, ద్వార ఈ-డెయిరీతో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర ప్రాంతాలలోని చిన్న డైరీ ఫామ్ యజమానులకు ఆర్థిక సహాయాన్ని గోద్రెజ్ క్యాపిటల్ అందించనుంది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ యొక్క డైవర్సిఫైడ్ ఫుడ్ అండ్ అగ్రి-బిజినెస్ సమ్మేళనం అయిన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ (జీఏవీఎల్)కు అనుబంధ సంస్థ క్రీమ్‌లైన్ డైరీప్రొడక్ట్స్ లిమిటెడ్. ఇది గోద్రెజ్ జెర్సీ బ్రాండ్ పేరిట ఉత్పత్తులను విక్రయిస్తుంది.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా తెలయజేయునది ఏమనగా ది.24-05-2024 శుక్రవారం ఉ॥ 11 గం॥లకు గవర్నరుపేట బ్రాంచ్ నందు 20.00 గ్రాములు, ప్రకాష్‌నగర్ బ్రాంచినందు 1211.00 గ్రాములు, మరియు రామవరప్పాడు బ్రాంచినందు 118.00 కుదవపెట్టిన పాతబంగారు నగలు మా హెడ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయి నందున, వారందరికీ మా వేలం పాట ప్రకటనలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంటతీసుకుని రావలెను. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై నిబంధనల కొరకు దయచేసి మా హెడ్ ఆఫీసు నందు సంప్రదించగలరు.

H.O.అరుణా ఫైనాన్స్ లిమిటెడ్
డోర్ నెం. 59-2-1/2, మొదటి అంతస్తు,
అమ్మ ఫంక్షన్ హాల్, అశోక్‌నగర్, విజయవాడ-10.
సెల్: 88851 22377

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
P.O.P. No.3/2023

BETWEEN:
Chagantipati Srinivasa Rao **Petitioner (Plaintiff)**
AND
Suthari Seshu Kumari **- Respondent (Defendant)**

RESPONDENT:
Suthari Seshu Kumari, W/o. late Narasaiah, Hindu, aged about 55 years, R/o. D. No.1-118, Rajapet, Mylavaram Village and Mandal, NTR District.

The above said petition stands posted to **10-07-2024** for apperance of the Respondent and to answer the claim of the petitioner either in person or through their Advocate at 10.30 A.M., onwards.

B. KOTI REDDY,
B.S.Ratnakar Reddy, Advocates
Office: Ammana Estates,
Governorpet, Vijayawada-520002
Off: 0866-2432799, Res: 0866-2451050,
cell : 9490148500.
Vijayawada, Date: 20.05.2024

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS VIJAYAWADA
Dispute/ACP No. 178 of 2022

Between:
Sri Sai ANJANA Chit Funds India Pvt Ltd Vijayawada Branch, rep. by It's Foreman Nampally Chandra Sekhar Son of Venkanna **- DISPUTANT**
AND
Bachalakurapati Ramanaiah and others **- OPPONENTS**

To,
Bachalakurapati Ramanaiah, Son of Ankalu, D.No. 39-12-108, T Kumbha Rao Street, Beside M K Gandhi School, Labbipet, Vijayawada-10.
Kondru Lakshmi Prasanna, W/o Narendra, R/O . D.No. 77-13A/3-31A, Near Masid Centre, Sundaraiah Nagar, Azith Singh Nagar, Payakapuram, Vijayawada-15.
Jonnalagadda Padmavathi, W/o Mallikharjuna Rao, R/O D.No.16-6-11, Ganti Vari Street, Back side of Vidhya English Medium School, Purnandam peta, Gandhi Nagar, Vijayawada-03.
- Opponent No. 1,3 & 4

Please take notice that the above claim petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **28-05-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 toanswer the claim on **28-05-2024 at 10-30 A.M.** in person failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble District Registrar)

T Anjaneyulu, Advocate,
Satyanarayanapuram, Vijayawada-11.
Date of Adjournment: 28-05-2024

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS VIJAYAWADA
Dispute/ACP No. 179 of 2023

Between:
Sri Sai ANJANA Chit Funds India Pvt Ltd Vijayawada Branch, rep. by It's Foreman Nampally Chandra Sekhar Son of Venkanna **- DISPUTANT**
AND
Daggula Vikas Reddy and others **- OPPONENTS**

To,
Daggula Vikas Reddy Son of Ramachandra Reddy, R/o Flat. No. S-3, Jeevan Vihar Appartments, Layola College Road, Opp. Andhra Layola College, Vijayawada.
Daggula Sumanth Reddy, Son of Rama Koti Reddy, R/o D.No. 54-16-8/17A, Sree Residency, 4th line, Venkateswara Nagar, Vijayawada.
Garapati Vijaya Kumar, Son of Vykuntam, R/o F.No. 3A, Sri Green Park Apartments, Opp. Andhra Layola College, Vijayawada.
Daggula Ramachandra Reddy Son of Subba Reddy, R/O. F.NO S-3, Jeevan Vihar Appartments, Layola College Road, Opp. Andhra Layola College, Vijayawada.
- Opponent No. 1,3,5 & 6

Please take notice that the above claim petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **28-05-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on **28-05-2024 at 10-30 A.M.** in person failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble District Registrar)

T Anjaneyulu, Advocate,
Satyanarayanapuram, Vijayawada-11.
Date of Adjournment: 28-05-2024